





# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

ఆదివారం,
నవంబరు 23, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## అప్పుల విషయంలో రేవంత్ తప్పుడు ప్రచారం: కేటీఆర్

**ప్రతినెల వడ్డీ రూ.2,300 కోట్లు మాత్రమే 7,000 కోట్లు అనడం అబద్ధం**

**కాగ్ నివేదికతో కాంగ్రెస్ లెక్కలు బట్టబయలు**

**ప్రజలను తప్పుదోవ పట్టించిన సీఎం క్షమాపణలు చెప్పాలి**

**23 నెలల్లో రూ.2.23 లక్షల కోట్ల రుణాలు ఎక్కడ? : కేటీఆర్ ప్రశ్న**

హైదరాబాద్: రాష్ట్ర అప్పుల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా తప్పునని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రతినెల ప్రభుత్వం కడుతున్న వడ్డీ రూ.2,300 కోట్ల పరిమితిలోనే ఉండగా, సీఎం మాత్రం రూ.7,000 కోట్లు అని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని శనివారం ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. అక్టోబర్‌లో విడుదలైన కాగ్ నివేదిక కాంగ్రెస్ ప్రచారం చేసిన అంచనాలను పూర్తిగా ఖండించిందని, కేసీఆర్ ప్రభుత్వపు అప్పులపై వడ్డీతోనే

# కవులలో అందెశ్రీ వజ్రంలాంటివారు

**కవులు, కళాకారులే ప్రజాసమాజానికి దిశ చూపే శక్తి : సీఎం రేవంత్**

**రాష్ట్రం ఏర్పడ్డాక కళాకారుల స్వరాన్ని అణచివేయడానికి ప్రయత్నమైందని విమర్శ**

**'జయ జయహే తెలంగాణ' పాటను ప్రతి పాఠ్యపుస్తక తొలి పేజీలో ప్రచురణ**

**దళిత వర్గీకరణతో ఎన్నేళ్ల విభేదాలు తీరిపోయాయని వ్యాఖ్య**

**అందెశ్రీ పేరుతో స్మృతివనం, కవుల కుటుంబాలకు ఆర్థిక అండ ప్రకటించిన ప్రభుత్వం**



హైదరాబాద్ : సమాజంలో మార్పు తీసుకు రావడంలో కవులు, కళాకారుల పాత్ర అమో ఘమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గూడ అంజయ్య, గద్దర్, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయరాజ్ వంటి సృజనశీలులు తెలంగాణకు నిజమైన ఆభరణాలన్నారు. అందెశ్రీని కోహినూర్ వజ్రంతో పోల్చుతూ, ఆయన పద్యాలు ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపినవని కీర్తించారు. రాష్ట్ర నిర్మాణం కోసం జరిగిన ఉద్యమంలో ఎంతో మందిని పోరాటబాట పట్టించింది ఈ తరానికి చెందిన కవులేనని రేవంత్ గుర్తుచేశారు. అవసరంమైతే ఇప్పటికీ కవులు ప్రజా సమస్యలపైనే తమ శబ్దాన్ని ఎత్తుతారని తెలిపారు. పాటలు, కవిత్వం, కళలివన్నీ ప్రజల జీవితాన్ని ప్రతిబింబించే దర్ప ణమని, ఇలాంటి గొప్ప సృజనకారులు తెలంగాణ నేలలోనే ఎక్కువగా వెలిసారని ఆయన పేర్కొ న్నారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తరువాత కవులు, కళాకారుల స్వరాన్ని అణగదొక్కే ప్రయత్నం జరిగి ందని విమర్శించారు. శనివారం రవీంద్రభారతిలో అద్లూరి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన అందెశ్రీ సంతాప సభలో

(మిగతా 2వ పేజీలో)

## పంచాయతీ ఎన్నికలు

# రిజర్వేషన్లు 50% లోపే

**2011 జనాభా - 2024 కులగణన ఆధారంగా రిజర్వేషన్ కేటాయింపు**

**సర్పంచ్ రిజర్వేషన్ ఆర్డీవోలు, వార్డు రిజర్వేషన్ ఎంపీడీవోలు**

**రొటేషన్ పద్ధతి కొనసాగింపు, మహిళలకు 50% లాటరీ రిజర్వేషన్**



## ప్రపంచ పురోగతికి మోదీ 4 మార్గదర్శకాలు

**జీ20 సదస్సులో మోదీ నాలుగు ప్రధాన అభివృద్ధి సూత్రాల ప్రతిపాదన**

**సంప్రదాయ విజ్ఞానం భద్రపరచాలని ప్రధాని పిలుపు**

**ఆఫ్రికా యువతకు నైపుణ్యాల పెంపుకు ప్రత్యేక కార్యక్రమం సూచన**

**ఆరోగ్య అత్యవసరాల కోసం గ్లోబల్ రెస్పాన్స్ టీమ్ ప్రతిపాదన**

**డ్రగ్స్-టెర్రరిజం అనుబంధాన్ని నిర్మూలించేందుకు దేశాలు కలవాలని పిలుపు**



జోహన్నెస్‌బర్గ్: ప్రపంచ అభివృద్ధి ప్రాధాన్యతలు మారుతున్న నేపథ్యంలో వాటిని తిరిగి విశ్లేషించే సమయం వచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమగ్రత, సుస్థిరత కలిగిన అభివృద్ధి దిశలను అనుసరించాలి అని అన్నారు. నాగరికతలలో నిలిచిన పురాతన విజ్ఞాన సారం ఆధారంగా భవిష్యత్ వృద్ధి నమూనాలు రూపొందించాలని సూచించారు. జీ20 దేశాల అంతటికి ప్రయోజనం చేకూరేలా నలుగురు ప్రధాన మార్గదర్శకాలను సమిట్‌లో ఉంచారు. ప్రపంచ సంప్రదాయ విజ్ఞానాన్ని ఒకే వేదికపై సేకరించి భద్రపర్చుడం చాలా అవసరమని ప్రధాని స్పష్టం చేశారు. ఆరోగ్యం, సామాజిక సంబంధాలు, పర్యావరణం వంటి అంశాల్లో శతాబ్దాలుగా వస్తున్న జ్ఞానాన్ని రికార్డు చేసి రాబోయే తరాలకు అందించే బాధ్యత జీ20కి

(మిగతా 2వ పేజీలో)



## డిసెంబర్ 5లోగా కన్సల్టెంట్ ఎంపికపై ఉత్తమ్ ఆదేశాలు

**ఎన్‌డీఎస్ఏ సూచనలతో రిపేర్ పనులకు రూపకల్పన**

**ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధుల లెక్కలు సమర్పించాలని సూచన**

**పర్యావరణ అనుమతులపై సుప్రీంకోర్టు తీర్పు గుర్తుచేసిన మంత్రి**



## అందుకే కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తున్నాను ::: కడియం శ్రీహరి

**సమాధానం ఇచ్చేందుకు సమయం కోరినట్లు తెలిపిన కడియం శ్రీహరి**

**సభాపతి తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్న కడియం**

**ఉప ఎన్నికలు వస్తే కచ్చితంగా పోటీ చేస్తానని స్పష్టీకరణ**

## కేసుల భారాన్ని తగ్గించటం నా తొలి లక్ష్యం

**పెండింగ్ సమస్యలపై దృష్టి సారిస్తానని సూర్యకాంత్ వెల్లడి**

**మధ్యవర్తిత్వ వ్యవస్థకు పూర్తి ప్రోత్సాహం**

**దేశవ్యాప్తంగా కోర్టుల నుంచి పూర్తి నివేదికలు తీసుకురానున్నారు**

**సోషల్ మీడియా విమర్శలు నన్ను కదిలించవని స్పష్టం**



న్యూఢిల్లీ: దేశంలో సంవత్సరాలుగా పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించడం తన మొదటి లక్ష్యమని, త్వరిత పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నానని త్వరలో పదవీ బాధ్యతలు స్వీకరించబోయే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. నవంబర్ 24న సీజేఐగా ప్రమాణస్వీకారం చేయనున్న ఆయన, శనివారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో మీడియాతో స్వల్పంగా మాట్లాడారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే తీర్చాల్సిన ప్రధాన అంశాలపై స్పష్టతనిచ్చారు. దేశవ్యాప్తంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు అత్యంత పెద్ద సవాలుగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. సుప్రీంకోర్టులోనే దాదాపు 90,000 కేసులు ఇంకా పరిష్కారం కోసం ఎదురుచూస్తుండటాన్ని ఆయన ఆందోళనగా పేర్కొన్నారు. "ఇవి ఇంతలా పెరిగే వరకూ ఏం తప్పు జరిగింది అనేది ఇప్పుడు పరిశీలన అంశం కాదు. కానీ వీటిని

(మిగతా 2వ పేజీలో)



## అడవులు వదిలి వెలుగులోకి రండి

**ఎలాంటి మార్గం ద్వారా వచ్చినా మీ రక్షణ బాధ్యత ప్రభుత్వందే: డీజీపీ**

**డీజీపీ ఎదుట 37 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగుబాటు**

**లొంగిపోయిన వారిపై ఉన్న 1.41 కోట్లు రివార్డు అందజేత**

# అందెశ్రీ తెలంగాణ స్వరమూర్తి

ముఖ్యమంత్రి పాల్గొని, అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రంపై దశాబ్దం పాటు పాలించిన ప్రభుత్వమే కవుల గొంతును తగ్గించేందుకు కుట్రలు పన్నిందని, ఉద్యమాన్ని చెలరేగించిన 'జయ జయహే తెలంగాణ' గీతానికి కూడా సరైన గుర్తింపు ఇవ్వలేదని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తరాలు ఈ రచనలు తెలుసుకోకూడదనే ఉద్దేశంతో వాటిని అడ్డగించినట్టు వ్యాఖ్యానించారు. కానీ తెలంగాణ ప్రజలు మోసపోవరని, అవసరమైనప్పుడు ఏకం అయ్యి గద్దెదించగల శక్తి ఈ సమాజానికి ఉందని చెప్పారు. గతంలో పెన్నులపై మన్ను వేయాలని ప్రయత్నిస్తే, ఆ పెన్నులే తిరుగుబాటుకు ఆయుధాలయ్యాయని గుర్తుచేశారు. చివరికి ప్రజలు అధికారాన్ని మార్చి ప్రజాప్రభుత్వాన్ని నిలబెట్టారని అన్నారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణలో దేశంలోనే ముందుండి పాలన చేసిన రాష్ట్రం తెలంగాణేనని, సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుందని వివరించారు. ఈ వర్గీకరణతో దళిత కులాల మధ్య ఉన్న పాత విభేదాలు ముగిసిపోయాయని, ఉన్నత చదువుల్లో అర్హత పొందని పలు కులాలు ఇప్పుడు వైద్య సీట్లను కూడా సాధిస్తున్నాయని చెప్పారు. ఇది ప్రజాప్రభుత్వం చేసిన కృషి ఫలితమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అందెశ్రీ స్మారకార్థం ప్రత్యేకంగా స్మృతి వనాన్ని నిర్మించనున్నట్టు ప్రకటించారు. 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతంగా గుర్తింపు పొందిన వెంటనే ప్రతి పాఠ్యపుస్తక తొలి పేజీలోనే అది ముద్రించబడుతోందని తెలిపారు. గద్దర్, అందెశ్రీ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అదనంగా, ఉద్యమంలో విశేష పాత్ర పోషించిన తొమ్మిది మంది కవులకు 300 గజాల ఇంటిస్థలం కేటాయించినట్టు తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలో వీరికి



అందమైన ఇళ్ల నిర్మాణ బాధ్యతను మంత్రి దామోదర రాజనర్సింహకు అప్పగిస్తున్నామని చెప్పారు. మరోవైపు, వారికి ఒక్కో కుటుంబానికి ఒక కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, కళాకారులు అందెశ్రీ స్మరణగా పాటలు పాడి నివాళులు అర్పించారు. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్5లోగా కన్సల్టెంట్ ఎంపికపై ఉత్తమ్ ఆదేశాలు

**ఎన్‌డీఎస్‌ఏ సూచనలతో రిపేర్ పనులకు రూపకల్పన**

**ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధుల లెక్కలు సమర్పించాలని సూచన**

**పర్యావరణ అనుమతులపై సుప్రీంకోర్టు తీర్పు గుర్తుచేసిన మంత్రి**



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునర్నిర్మాణానికి అవసరమైన డిజైన్ కన్సల్టెంట్ల ఎంపిక ప్రక్రియను డిసెంబర్ 5లోగా పూర్తి చేయాలని నీటిపారుదల శాఖాధికారులకు మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రిపేర్ పనులు చేపట్టాల్సిందిగా ఆయన స్పష్టం చేశారు. జలసౌధలో శనివారం జరిగిన శాఖ సమీక్ష సమావేశంలో ప్రసక్తి ప్రాజెక్టుల ఆయకట్టు వివరాలను సేకరించి సమగ్ర నివేదికగా సమర్పించాలని సూచించారు. అత్యవసర ప్రాజెక్టులను గడువులోగా ముగించడానికి అవసరమైన నిధుల లెక్కలను కూడా సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రకృతి అనుమతులు లేకుండా నిర్మించిన ప్రాజెక్టులకు తరువాత దశలో అనుమతులు ఇవ్వరాదని గత తీర్పును సవరించిన సుప్రీంకోర్టు తాజా నిర్ణయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. దాన్ని ఆధారంగా చేసుకొని పాలమూరు%-%రంగారెడ్డి, డిండి, సీతారామ ప్రాజెక్టులకు అనుమతులు తీసుకునేందుకు అవసరమైతే కోర్టులో పిటిషన్లు దాఖలు చేయాలని ఆదేశించారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. టీఏసీ ఆమోదం పొందిన మొడికుంటవాగు, చనాకా%-%కొరాటా డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్, చిన్న కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులకు కేంద్ర పెట్టుబడి క్లియరెన్స్ తీసుకొని పీఎంకేఎస్‌వై కింద నిధుల కోసం దరఖాస్తు చేయాలని వెల్లడించారు. తుమ్మిడిహెట్టి బరాజ్ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి, డీపీఆర్ తయారీ టెండర్లు ఇప్పటికే పిలిచినట్టు అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు. ఖాళీ పోస్టులను బదిలీల ద్వారా భర్తీ చేయాలని, సింగూరు ప్రాజెక్ట్ రిపేర్ పనులను త్వరగా ముగించాలని సూచించారు. తదుపరి మంత్రివర్గ సమావేశానికి అవసరమైన అంశాల జాబితాను సిద్ధం చేయాలని అధికారులు ఆదేశాలు పొందారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ ద్వారా హుస్నాబాద్ రైతులకు శాశ్వతంగా నీరందించేలా కాల్వల తవ్వకం, భూసేకరణకు కావాల్సిన నిధులు త్వరలో విడుదల చేయనున్నట్టు మంత్రి ఉత్తమ్ సమీక్షలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# అడవులు వదిలి వెలుగులోకి రండి

**ఎలాంటి మార్గం ద్వారా వచ్చినా మీ రక్షణ బాధ్యత ప్రభుత్వదే: డీజీపీ**

**డీజీపీ ఎదుట 37 మంది మావోయిస్టులు ఆయుధాలతో లొంగుబాటు**

**లొంగిపోయిన వారిపై ఉన్న 1.41 కోట్లు రివార్డు అందజేత**

**అజ్ఞాతంలో ఉన్న 59 మందికి కూడా లొంగిపోవాలని పోలీసుల సూచన**

హైదరాబాద్: 'ఇక అటవీ జీవితం మానేసి బహిరంగంగా ముందుకు రండి. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవడం ప్రభుత్వ బాధ్యత. మీరు ఎలాంటి మార్గం ఎంచుకున్నా మీడియా, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బందిదేనిద్వారమైనా లొంగుబాటు కావచ్చు. మీపై ఎలాంటి వేధింపులు ఉండకుండా పూర్తిగా రక్షణ కల్పిస్తాం' అని డీజీపీ బి. శివధర్‌రెడ్డి మావోయిస్టులను కోరారు. సరెండర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సానుకూలంగా వ్యవహరిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా దీనికి స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారని తెలిపారు. భద్రాచలం-కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజనల్ కమిటీ కార్యదర్శి కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ సహా మొత్తం 37 మంది మావోయిస్టులు డీజీపీ ఎదుట ఆత్మసమర్పణ చేశారు. వీరిలో 25 మంది మహిళలు, 12 మంది పురుషులు ఉన్నారు. లొంగుబాటు సమయంలో ఒక ఏకే-47, రెండు ఎస్‌ఎల్‌ఆర్‌లు, నాలుగు .303 గన్స్, ఒక జీ-3 రైఫిల్‌తో పాటు వివిధ రకాల 346 బుందుగులను పోలీసులు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఇంటెలిజెన్స్ అదనపు డీజీ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ సుమతితో కలిసి డీజీపీ మాట్లాడారు. అంతర్గత విభేదాలు, అనారోగ్యం మరియు నిరంతర కూంబింగ్ ఆపరేషన్ల వల్ల ఒత్తిడి పెరగడంతోనే ఈ మావోయిస్టులు సరెండర్ అయ్యారని వివరించారు. లొంగిపోయిన వారిపై ప్రకటనలో ఉన్న మొత్తం రివార్డు రూ. 1.41 కోట్లను డీడీ రూపంలో వారికి అందజేశారు. తెలంగాణకు చెందిన మావోయిస్టులకు పునరావాస సౌకర్యాలు, ఆర్థిక సహాయం అందజేయడం ప్రభుత్వ విధానమని డీజీపీ స్పష్టం చేశారు. లొంగుబాటు చేసిన ప్రతి ఒక్కరికీ వెంటనే రూ.25 వేల చొప్పున సహాయం అందించామని



తెలిపారు. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 465 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట ఆత్మసమర్పణ చేశారని వెల్లడించారు. ఇంకా రాష్ట్రానికి చెందిన 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ తెలిపారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ నాయకులుముప్పాళ లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణేశ్, పసునూరి నరహరి ఉన్నారని వివరించారు. దండకారణ్య, తెలంగాణ, ఇతర రాష్ట్ర కమిటీలకు చెందిన పది మంది స్టేట్ స్థాయి నాయకుల వివరాలను కూడా వెల్లడిస్తూ, వారూ లొంగిపోవాలని సూచించారు. మావోయిస్టు నాయకుడు సాంబయ్య మాట్లాడుతూ, "ఈ రోజుల్లో పార్టీ పరిస్థితులు క్షీణించడం, ఆరోగ్య సమస్యలు తీవ్రం కావడం వల్లే బయటకు రావాల్సి వచ్చింది. పార్టీ అనుమతితోనే పోలీసుల ఎదుట లొంగిపోయాం" అన్నారు. ఇతర మావోయిస్టులూ అలానే ప్రజలతో కలిసి సాధారణ జీవితంలోకి రావాలని కోరారు. ప్రస్తుతం పార్టీకి నాయకత్వం వహిస్తున్నది ఎవరో తాము తెలియదని తెలిపారు.

# ప్రపంచ పురోగతికి మోదీ 4 మార్గదర్శకాలు

ఉందన్నారు. ఆఫ్రికా ఖండంలోని యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు పెద్దస్థాయిలో ప్రత్యేక ప్రోగ్రామ్ చేపట్టాలని మోదీ ప్రతిపాదించారు. దక్షిణాఫ్రికాలో శనివారం ప్రారంభమైన జీ20 నేతల సమావేశంలో ప్రసంగించిన ఆయన, అభివృద్ధి అసమానతలు పెరుగుతున్న ప్రాంతాల్లో వనరుల కొరత, పర్యావరణ అసమతుల్యతలు గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సమన్విత మానవతా దృక్పథం ప్రాచీన భారతీయ విలువల్లో భాగమైందని, అదే భావన ప్రపంచ అభివృద్ధిని సరైన దారిలో నడిపిస్తుందని చెప్పారు.

**సంప్రదాయ జ్ఞానాన్ని తరాల తరబడి నిలుపుదల చేయాలి**

"వేల సంవత్సరాలుగా పరీక్షించబడిన జీవన విధానాలను కాపాడుకోవడం అత్యంత ముఖ్యం. జీ20 వేదికగా వీటిని ఒకచోట సమీకరించి, ప్రపంచానికి అందుబాటులో ఉంచాలి. వాతావరణ పరిస్థితుల్లో వేగమైన మార్పులు, మనుషుల జీవన శైలిలో ఎదురవుతున్న అంతరాయాల నేపథ్యంలో ఇది అత్యవసరం" అని వివరించారు.

**ఆఫ్రికా కోసం నైపుణ్య ప్రోత్సాహ కార్యక్రమం**

ఆఫ్రికా ఖండం పురోగతి ప్రపంచ ఆర్థికవ్యవస్థకు కీలకమని మోదీ అన్నారు. వచ్చే పది సంవత్సరాలలో కనీసం



పది లక్షలమంది శిక్షణ పొందిన ట్రైనర్లను తయారు చేసే ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ ప్రాజెక్టును జీ20 ముందుండి నడపాలని సూచించారు. ఈ ట్రైనర్లు లక్షలాది యువతకు నైపుణ్యాల శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను విస్తరించడం లక్ష్యం.

**అత్యవసర పరిస్థితుల కోసం అంతర్జాతీయ వైద్య బృందం**

ప్రకృతి విపత్తులు లేదా ఆరోగ్య అత్యవసరాల సందర్భంలో వెంటనే చర్యలు తీసుకునే గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్‌ని ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. జీ20 దేశాలకు చెందిన నిపుణ వైద్యులను ఈ బృందంలో చేర్చి, సమయం వచ్చినప్పుడు బాధిత దేశాలకు తక్షణ సేవలు అందించాలన్నారు.

**సింథటిక్ డ్రగ్స్-ఉగ్రవాద సంబంధం దేశాలపై దాడి**

ఫెంటానిల్ వంటి మాదక ద్రవ్యాలు ప్రపంచ ఆరోగ్యానికి పెను ప్రమాదమని, వీటి వెనుక ఉగ్రవాద నెట్వర్క్‌లు పనిచేస్తున్నాయని మోదీ హెచ్చరించారు. డ్రగ్స్%-%టెర్రర్ బంధాన్ని పూర్తిగా ధ్వంసం చేసేందుకు ఐక్య కార్యాచరణ అవసరమని చెప్పారు. నిధుల ప్రవాహాన్ని అడ్డుకోవడం, అక్రమ వ్యాపారాన్ని మూసివేయడం అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశాలు అని వెల్లడించారు.

**అరుదైన మూలకాలపై ప్రపంచ దృష్టి**

వాడేసిన ఎలక్ట్రానిక్ పరికరాలు, డిజిటల్ ఉపకరణాల నుంచి అరుదైన మూలకాలను తిరిగి సేకరించేందుకు అర్బన్ మైనింగ్ వంటి ఆవిష్కరణలను ప్రోత్సహించాలి అని మోదీ సూచించారు. కొత్త బ్యాటరీలపై మాత్రమే ఆధారపడకుండా రీసైక్లింగ్ వ్యవస్థలను విస్తరించాలన్నారు.

**భారత్-ఆస్ట్రేలియా-కెనడా త్రైపాక్షిక సాంకేతిక భాగస్వామ్యం**

జోహన్నెస్‌బర్గ్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథనీ అల్బానీస్, కెనడా ప్రధాని కారీతో సమావేశమైన మోదీ, ఈ మూడు దేశాలు సాంకేతికత, ఇన్నోవేషన్ రంగాల్లో కలిసి పనిచేయాలని అంగీకరించాయని వెల్లడించారు.

## పంచాయతీ ఎన్నికలు రిజర్వేషన్లు 50% లోపే

తెలిపింది. అయితే 2019 తర్వాత కొత్తగా ఏర్పడిన గ్రామాల్లో జరిగే ఎన్నికలను మాత్రం మొదటి ఎన్నికలుగానే చూడాలని వివరించింది. సర్పంచ్ రిజర్వేషన్ బాధ్యతలను రెవెన్యూ డివిజనల్ అధికారులకు అప్పగిస్తూ పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి ఎస్రీధర్ అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేశారు.

## రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ గణాంకాలు అసత్యం: కేటీఆర్

ఇవే కాంగ్రెస్ చేస్తున్న అపప్రచారాన్ని వెలుగులోకి తెచ్చాయని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పుల వడ్డీలకే ప్రభుత్వ ఆదాయం, కొత్త రుణాలన్నీ వినియోగమవుతున్నాయని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కాగ్ నేరుగా తిరస్కరించిందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతీ సందర్భంలో "ప్రతి నెలా ఆరు నుంచి ఏడు వేల కోట్లు వడ్డీలకే వెళ్తున్నాయి" అని చెప్పడం పూర్తిగా తప్పు అని కేటీఆర్ మండిపడ్డారు. తాజా కాగ్ నివేదిక కాంగ్రెస్ నేతల ఈ తరహా వాదనలకు మరోసారి కఠినమైన సమాధానంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 2025 నుంచి అక్టోబర్ 2025 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిన మొత్తం వడ్డీ కేవలం రూ.16,529.88 కోట్లేనని కేటీఆర్ వివరించారు. ఇది నెలకు సగటున చూస్తే సుమారు రూ.2,361 కోట్లుగా వస్తుందని, కానీ ప్రభుత్వం మాత్రం వడ్డీల పేరుతో అతిశయోక్తులు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని విమర్శించారు. పార్లమెంట్ ఇచ్చిన సమాచారం ప్రకారం బీఆర్ఎస్ దశాబ్దకాలంలో రూ.2.80 లక్షల కోట్ల రుణాలు తీసుకోగా, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 23 నెలల్లోనే దాదాపు రూ.2.30 లక్షల కోట్ల అప్పులను సమకూర్చిందని ఆయన తెలిపారు. ఇంత భారీ రుణభారం ఎవరి ప్రయోజనాల కోసం ఉపయోగపడుతోందో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందని కేటీఆర్ డిమాండ్ చేశారు. వడ్డీల విషయం లో అబద్ధాలను చల్లి ప్రజల దృష్టిని మళ్లించే రేవంత్ ప్రభుత్వం కొత్తగా తీసుకుంటున్న ఈ రుణాలు అసలు ఎవరికి చేరుతున్నాయో స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ హితవు పలికారు.

## అందుకే కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తున్నాను : కడియం శ్రీహరి

**సమాధానం ఇచ్చేందుకు సమయం కోరినట్లు తెలిపిన కడియం శ్రీహరి**

**సభాపతి తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్న కడియం**

**ఉప ఎన్నికలు వస్తే కచ్చితంగా పోటీ చేస్తానని స్పష్టీకరణ**

తన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తున్నానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఈ నెల 23వ తేదీలోపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని సభాపతి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన స్పందిస్తూ, తనకు నోటీసులు అందాయని తెలిపారు. అయితే, వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని సభాపతిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. సభాపతి ఇచ్చిన గడువులోగా వివరణ ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. సభాపతి తీసుకునే నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అధికార పార్టీతో కలిసి పనిచేస్తున్నందునే స్టేషన్ ఘనపూర్‌కు పెద్ద ఎత్తున అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన వెల్లడించారు. తాను ఎవరికీ భయపడని వ్యక్తినని అన్నారు. ఒకవేళ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు వస్తే తాను తిరిగి పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలు తనను ఆశీర్వదిస్తారనే నమ్మకం తనకు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

## కేసుల భారాన్ని తగ్గించటం నా తొలి లక్ష్యం

సత్వరం క్రమబద్ధీకరించాల్సిందే. అందుకోసం హైకోర్టులు, దిగువ కోర్టుల నుండి పూర్తి వివరాలు తెప్పిస్తా" అని ఆయన తెలిపారు. మధ్యవర్తిత్వం కేసుల తగ్గింపుకు అత్యుత్తమ మార్గమని జస్టిస్ సూర్యకాంత్ విశ్లేషించారు. వివాదాల పరిష్కారానికి ఈ విధానం ఎంతో సమర్థవంతంగా పని చేస్తుందని, కేసుల కుప్ప కరిగేందుకు ఇదే సరైన ఆయుధమని పేర్కొన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతను ప్రస్తావించిన విషయం గుర్తుచేశారు. దేశంలోని అనేక సంస్థలు, బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు కూడా ఈ పద్ధతిపై ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఢిల్లీలో భూ సంబంధిత ఇలాంటి కేసులు పెద్ద సంఖ్యలో ఉండగా, తాను ఇచ్చిన ఒక్క నిర్ణయంతోనే 1,200 కేసులు ఒకేసారి పరిష్కారమయ్యాయని ఆయన చెప్పారు. రాజ్యాంగ సంబంధిత విభేదాలు హైకోర్టుల్లో పేరుకుపోయిన సందర్భాల్లో, సుప్రీంకోర్టులో ప్రత్యేక రాజ్యాంగ ధర్మాసనాలను ఏర్పాటు చేసి వాటిని తీర్చేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. సోషల్ మీడియాలో న్యాయమూర్తులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న విమర్శల గురించి మాట్లాడుతూ "ఇలాంటి వ్యాఖ్యలు నాకు ఎలాంటి ప్రభావం చూపవు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థానానికి చేరిన తర్వాత ఇలాంటి చిన్నపాటి విమర్శలను అస్సలు పట్టించుకోం. న్యాయసంబంధిత నిష్పక్షపాత విమర్శలను మాత్రం గౌరవిస్తాను" అని స్పష్టం చేశారు. దేశ రాజధానిలో కాలుష్యం తీవ్రమైనా, ప్రతిరోజూ ఉదయం నడక తప్పనిసరిగా చేస్తానని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. వాతావరణం ఎలా ఉన్నా దాదాపు గంటసేపు వాకింగ్ చేయడం తన అలవాటని చెప్పారు.

## ఐబొమ్మ రవి కేసులో కీలక మలుపు.. మరింత బిగుస్తున్న ఉచ్చు!

**ఐబొమ్మ రవి కేసు దర్యాప్తులో సీఐడీ అధికారులు ప్రవేశం**

**ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ల ప్రమోషన్ కోణంలో విచారణ**

**మూడో రోజు కస్టడీకి తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు**

**రవికి సహకరిస్తున్న వారి వివరాలపై పోలీసుల ఆరా**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఐబొమ్మ కేసులో దర్యాప్తు మరింత వేగవంతమైంది. ఈ కేసులోకి తాజాగా తెలంగాణ సీఐడీ అధికారులు ప్రవేశించారు. ఐబొమ్మ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ సైట్లను ప్రమోట్ చేసిన వ్యవహారంపై సీఐడీ దృష్టి సారించింది. ఇప్పటికే బెట్టింగ్ ప్రమోషన్ కేసులను దర్యాప్తు చేస్తున్న సీఐడీ, ఈ కేసులో కీలక సమాచారం రాబట్టేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో నిందితుడు రవికి సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను కోరింది. మరోవైపు సైబర్ క్రైమ్ పోలీసులు రవిని మూడో రోజు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇవాళ కూడా విచారణ కొనసాగనుంది. నిన్న దాదాపు ఆరు గంటల పాటు సాగిన విచారణలో పలు కీలక వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. ఐబొమ్మకు కొత్త సినిమాలను ఎవరు సరఫరా చేస్తున్నారు? అతనికి సహకరిస్తున్న ఏజెంట్లు ఎవరు? గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో రవికి ఉన్న సంబంధాలు ఏమిటి? అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసుల విచారణ కొనసాగుతుండగా, ఇప్పుడు సీఐడీ కూడా రంగంలోకి దిగడంతో ఈ కేసులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. రెండు ఏజెన్సీల దర్యాప్తుతో రవికి సహకరించిన వారికి ఉచ్చు మరింత బిగుసుకున్నట్లయింది.

## చిల్లాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సహకారంతో ఉచిత బ్యాగులు పంపిణీ

### పాఠశాల స్థాయి నుంచే సేవాభావాన్ని అవలంబర్చుకోవాలి - కల్లెట్ల అరుణ్ సాగర్




యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

సంస్థాన్ నారాయణపురం మండలం చిల్లాపురం గ్రామంలో సహస్ర వేదిక్ సేవాసమితి ఆధ్వర్యంలో చిల్లాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సహకారం తో ఉచిత బ్యాగ్ లను పంపిణి చేయడం జరిగింది.విద్యార్థులకు పరిశుభ్రత పైన అవగాహన మరియు చిన్నతనం నుండే సేవా భావాన్ని అలవార్చుకోవాలి అని సూచించారు. నిర్వాహకులు జ్ఞాపకశక్తికి సంభందించిన ఆటలను నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఉష్కాగుల గిరి బాబూ,కల్లెట్ల అరుణ్ సాగర్,కోగూరి శ్రవణ్ కుమార్, మేకని రాఘవేంద్ర ,పగిడిమర్రి కార్తీక్,బుగ్గరాములు తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి మహా పడిపూజా కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్...

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోనీ గోపనపల్లి రంగనాథ స్వామి ఆలయం వద్ద, వివేకానంద నగర్, విజయ నగర్ కాలనీలో, చందా నగర్ అపర్ణ గార్డెనియా గేటెడ్ కమ్యూనిటీలో మరియు తారానగర్ తుల్జా భవానీ ఆలయం వద్ద నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజా మహోత్సవ కార్యక్రమాలలో సన్నిహితులు, శ్రేయోభిలాషుల ఆహ్వానం మేరకు పాల్గొన్న బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటేస్టెడ్ ఎమ్మెల్యే ఇంఛార్జి రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దీక్షతో కొలవడం ద్వారా ఆపదలు తొలగి అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు చేకూరుతాయన్నారు, శరణంటూ ఆశ్రయించిన వారిని కాపాడే దైవం హరిహరసుతుడు అయ్యప్ప అని అన్నారు. స్వామి వారి పడిపూజ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. 41 రోజులు మండలం పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో,ఎన్నో నియమాలతో నిర్వర్తించే ఈ అయ్యప్ప దీక్షను చేపట్టడం వలన ఆ స్వామి వారి కృపాకటాక్షాలు ఉంటాయని హరిహరసుతుడు అయ్యప్ప స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నారు.



## అన్నదానం గొప్పదానం....గొప్ప కార్యక్రమం...

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 159 వ అన్నదాన కార్యక్రమం గంగారం లో ని హెూప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 2900 మందికి హెూప్ వాలంటీర్లు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టారు. అన్న దాన కార్యక్రమం 159 వారాలుగా కొనసాగడం ఏంతో గొప్ప విషయమని తెలిపారు. వేల మంది ఓక పద్దతి క్రమంలో భోజన కార్యక్రమంలో పాల్గొనడం పట్ల ఫౌండేషన్ సభ్యులను స్థానికులు అభినందించారు. ఈ సంధర్బంగా హెూప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3 సంవత్సరాల క్రితం ప్రారంభం చేసిన అన్న సమారాధన నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెూప్ ఫౌండేషన్ సభ్యులు, లయన్స్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శిల్పారామం లో అలరించినా సాంస్కృతిక కార్యక్రమాలు....

మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ లో నీ శిల్పారామంలో నిర్వహిస్తున్న "గాంధీ శిల్ప బజార్" సందర్బంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం కథక్ మరియు కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. డాక్టర్ చంద్రతప సహా రాయ్ శిష్య బృందం కథక్ నృత్య ప్రదర్శనలో సరస్వతి వందన, శివ వందన, దమర్ , దాద్రా తాల్, రూపక తాల్, ఝాప తాల్, తీన్తాల్, గంగ అవతరం అంశాలను ఆరాధ్య, చారుష,హర్షిక, బ్రాహ్మణి, వందన ప్రీతి మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. శ్రీమతి ఆర్ ఎల్ సాహితి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో అంబ పరాకు, గణేష్ పంచరత్న, బ్రహ్మ కడిగిన పాదము, బొమ్మ బొమ్మ, ఇదిగో భద్రాద్రి, కృష్ణ కృష్ణ, బృందావన నిలయే,అదిగో అల్లదిగో, నామ నారాయణ, మంగళం అంశాలను కళాకారులు మహతి, హంసిని, భవాని, అమృత, సంజన, కావ్య, దివిజ మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# అయ్యప్ప మహా పడిపూజ కరపత్రం ఆవిష్కరణ

### శ్రీశ్రీశ్రీ శంఖారానంద స్వామీజీ ఆశీస్సులతో

### శ్రీ హరి హర పుత్రుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఆహ్వానము

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 22( వార్త మిర్రర్):యాదాద్రి భువనగిరి జిల్లాసంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఆదివారం 07 -12-2025 రోజున ఉదయం10 గంటలకు శ్రీశ్రీశ్రీ శంఖారానంద స్వామీజీ ఆశీస్సులతో శ్రీ హరి హర పుత్రుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఆహ్వానము. పూజా స్థలం శ్రీరామలింగేశ్వర దేవాలయం ( చౌరస్తా) నిర్వహించబడును.ఈ మహా పడిపూజ సందర్భంగా ఈరోజు రామాలయం వద్ద అయ్యప్ప స్వాములు ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించడం జరిగింది. (అలాగే శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి నూతన దేవాలయ నిర్మాణం గురించి నిధుల సేకరణ కార్యక్రమం కావున దాతలు సహకరించగలరని మనవి) ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ శంకరనంద స్వామిజి. శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి సన్నిధానం స్వాములు, చిలువేరు జంగయ్య గురుస్వామి, బాలగోని బాలరాజు గురుస్వామి, వెంకన్న గురుస్వామి, తెలంగాణ బిక్షం గురుస్వామి, చిలువేరు బాబు గురుస్వామి, దూసరి శ్రీశైలం గురు స్వామి, బొడ్డుపెల్లి కృష్ణ గురుస్వామి, వీరమల్ల మణికంఠ, గజం శ్రవణ్, చింతల సాయి చరణ్, పానకట్ల అనిల్, కొప్పు అరుణ్, టేకుమట్ల నగేష్, నీళ్ల శ్రీశైలం గౌడ్, పల్లె ఆనంద్ గౌడ్, బొమ్మల రఘుగౌడ్, ఉప్పల రాజయ్య, చిలువేరు శీను, చిలువేరు గణేష్, హరి ప్రసాద్ పంతులు, ఇరుకుల్ల సురక్షితం, వీరమల్ల ఓంకార్, రాపోలు బిక్షం, చిలువేరు అంజయ్య, వెంకటేష్, కృష్ణ, బద్దుల మల్లేష్ , ఐలయ్య పాల్గొన్నారు



# ఆటో డ్రైవర్లకు యూనిఫామ్లు పంపిణి

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం మసీద్ బండ కమిటీ హాల్ లో అన్నా అంటే నేనున్నా అంటూ, ఎక్కడ సమస్యలు ఉన్న అందుబాటులో ఉంటూ, నిత్యం ప్రజల వెంటనే ప్రజలతో ఉంటూ, తమదైన శైలిలో ఒక పక్క పార్టీ అభివృద్ధికి మరో పక్క ప్రజల సమస్యల పరిష్కరానికి అహర్నిశలు కృషి చేస్తూన్నా శేరిలింగంపల్లి గ్రేటర్ హైదరాబాద్ బి ఆర్ ఎస్ పార్టీ మాజీ యూత్ ప్రెసిడెంట్ మారబోయిన రవి యాదవ్ ఆటో కార్మికులు పడుతున్న ఇబ్బందులు చూసి ఎం ఆర్ వై ఫౌండేషన్ ద్వారా మసీద్ బండ, హెచ్ సి యూ డిపో, డిఎల్ఎఫ్ , ఇన్ఫోసిస్ , ఐఐటి ఆటో యూనియన్ డ్రైవర్లకు కాకి చొక్కాలు పంపిణి కార్యక్రమం నిర్వహించారు..ఈ కార్యక్రమంలో మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు చొక్కాల పంపిణి చేయడం ఆనందంగా ఉంది అంటూ ఇలాంటి కార్యక్రమాలు ఎం ఆర్ వై ఫౌండేషన్ ద్వారా మరిన్ని నిర్వహిస్తామని ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్న ఎం ఆర్ వై ఫౌండషన్ మరియు బి ఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్ ఐ రమేష్ కు శాలువా తో సత్కారించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు, అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆటో యూనియన్ సభ్యులు, ఆటో డ్రైవర్లకు ధన్యవాదాలు తెలియజేసారు.....ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్ ఐ రమేష్,శేరిలింగంపల్లి ఆటో యూనియన్ సభ్యులు,బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## అన్నమయ్యపురంలో కన్నుల విందుగా నృత్యార్చన.....

కొండాపూర్ వార్త మిర్రర్ : అన్నమాచార్య భావనా వాహిని వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. శోభారాజు ఆధ్వర్యంలో అన్నమయ్య సమేత శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామి వారికి కన్నుల విందుగా నృత్యార్చన జరిగింది. కుమారి, శ్రావ్య శ్రీ నివాస్, కుమారి సుధా మాధూరి, శ్రీ చిన్మయి కలిసి శ్రీ మత్ త్వధియ గురు స్తుతి, వచ్చెను అలమేలు మంగ,కులుకగ నడవరో, ముద్దుగారే యశోద, మరకథ మణిమయ చేల, పలుకుతేనెల తల్లి వంటి ప్రజాదరణ పొందిన కీర్తనలకు కూచిపూడి నృత్యంలో ప్రదర్శించి విచ్చేసిన భక్తులందరి మన్ననలందుకున్నారు తదనంతరం కళాకారులను సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డా. నందకుమార్ గారు జ్ఞాపికను అందించారు.చివరిగా శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వర స్వామి వారికి మంగళ హారతులు అందించి విచ్చేసిన భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు.





## మిషన్ త్రిబుల్ ఆర్ పై కళారూపాల ద్వారా అవగాహన

మిర్యాలగూడ , నవంబర్ 22:-( వార్త మిర్రర్) నల్గొండ జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ ఆదేశానుసారం మిర్యాలగూడ మండలం అవంతిపురం ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ లో నల్లగొండ డిటిఆర్బి, మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో జాగృతి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో మిషన్ త్రిబుల్ ఆర్ పై కళారూపాల ద్వారా శుక్రవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు.రోడ్డుపై వెళ్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోషల్ మీడియా,గంజాయి, ఇతర మత్తు మందు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులు డిఎస్పి రాజశేఖర్ రాజు, రూరల్ సీఐ పిఎన్డి.ప్రసాద్, ఎస్ఐ ఎం లక్ష్మయ్య, ఆర్ఆర్ఆర్ ఐసి సత్యనారాయణ, డాక్టర్ షేక్ మొయిద్ టీం సిపిఆర్ ప్రాక్టీస్ చేసి చూపించారు. కార్యక్రమంలో రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, జాగృతి పోలీస్ కళాబృంద ప్రజలను, విద్యార్థులను చైతన్యం చేషారు.



## బాలల పరిరక్షణ విద్య పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

మిర్యాలగూడ నవంబర్ 22:- (వార్త మిర్రర్) బాలల పరిరక్షణ, విద్యపట్ల శ్రద్ధ వహించాలని మిర్యాలగూడ ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సిడిపిఓ రేఖల మమత అన్నారు. ఆధ్వర్యంలో చిల్లాపురం సెక్టార్ పరిధిలోని లావుడి తండాఅంగన్వాడీ కేంద్రంలో ఇసిసిఇ డే ప్రోగ్రామ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీడీపీఓ మమతఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఇసిసిఇ)గురించి వివరించారు.అంగన్వాడి కేంద్రంలోని పిల్లలకు ఆట పాట కథలు చెప్తూ పిల్లల మానసిక ఎదుగుదలకు తోడ్పడే విధమైన బోధన గురించి వివరించారు. అదేవిధంగా పిల్లలు తయారుచేసిన డ్రాయింగ్ బుక్స్ ను ప్రదర్శించి అంగన్వాడీ కేంద్రంలో 4 కార్నర్స్ గురించి, పిల్లల లోపపోషణ లోపంను గుర్తైన వారిని గుర్తించి వారి పోషణ కొరకు బాలామృతం ప్లస్ ను పంపిణీ చేయడం జరుగుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రం లబ్ధిదారులు, తల్లిదండ్రులు, సంరక్షకులతో పోషకాహార గురించి వివరించారు. తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించే వివిధ రకాల ప్రీ స్కూల్ కార్యక్రమాలను, సౌకర్యాలను గుర్తించి పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకం అనేది నిత్య జీవితంలో తగ్గించాలని, అదేవిధంగా పిల్లలకు జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్ ఇవ్వకూడదని వివరించారు.కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ : ఆర్.వాణి, బ్లాక్ కో ఆర్డినేటర్ కవిత అంగన్వాడీ టీచర్లు మంగతి, పార్వతి, రామలక్ష్మి,అంగన్వాడీ ఆయా సోమ్లి కిషోరబాలికలుజి లబ్ధిదారులు పెద్దలు పాల్గొన్నారు.



## తార్నాక సెంటెన్స్ స్కూల్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్ మరమ్మతులకు డిప్యూటీ మేయర్ తక్షణ చర్య

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 22 : తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్ పనిచేయకపోవడంతో విద్యార్థులు, పెద్దలు, స్థానిక ప్రజలు ప్రధాన రహదారి దాటడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డికి లభించిన ఫిర్యాదుల నేపథ్యంలో తక్షణమే స్పందించారు.శనివారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి , టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి తో కలిసి తార్నాక సెయింట్ ఆన్స్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్శనలో జిహెచ్ఎంసి, ఇంజినీరింగ్ అధికారులను అక్కడికే పిలిపించి, లిఫ్ట్ నిలిచిపోయిన సాంకేతిక సమస్యలపై వివరణ కోరారు.డిప్యూటీ మేయర్ అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేస్తూ – " విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ ఈ బ్రిడ్జి ఉపయోగిస్తున్నారు. లిఫ్ట్ నిలిచిపోవడం ప్రజలు ప్రమాదంలో పడే పరిస్థితులకు దారితీస్తోంది. వెంటనే మరమ్మతులు పూర్తి చేసి, లిఫ్ట్‌ను ప్రజల ఉపయోగానికి తెరవాలి. ఈ విషయంలో ఆలస్యం చేస్తే అధికారులపై చర్యలు తప్పవన్నారు.అధికారులు అవసరమైన స్పేర్ పార్ట్స్‌ను వెంటనే సమకూర్చి, మూడు రోజుల్లో లిఫ్ట్‌ను పూర్తిగా పని చేసేలా సిద్ధం చేస్తామని డిప్యూటీ మేయర్ కి హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యాలు అందించడం ప్రభుత్వం, జిహెచ్ఎంసి ప్రాధాన్య కర్తవ్యం అన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే మా దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారుఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ నివాసులు, సెంటెన్స్ స్కూల్ పర్యవేక్షకులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## స్వయం సాధికారత దిశగా ప్రభుత్వం దృఢ సంకల్పం

### - కల్వకుర్తి మహిళ సమాఖ్య భవనం లో చీరల పంపిణీ

### - ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి నవంబర్ 22 వార్త మిర్రర్ ప్రతినిధి:-తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో భాగంగా కల్వకుర్తి మండల0 లో మహిళ సమాఖ్య భవనం లో మహిళలకు చీరలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటుందని తెలిపారు. మహిళలు కు ఇందిరమ్మ చీరల పంపిణీ ఎంతో ఉపయుక్తమవుతోందన్నారు. ప్రతి కుటుంబంలో మహిళ ఆనందంగా ఉంటే ఆ ఇంటి వాతావరణం సంతోషంగా మారుతుందని, అందుకే ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు.ఇక పై కూడా మహిళల అభివృద్ధి, స్వయం సాధికారత కోసం మరిన్ని పథకాలను అమలు చేస్తామని ఎమ్మెల్యే నారాయణ రెడ్డి అన్నారు. పారదర్శకంగా, ప్రతి అర్హురాలికి చీరలు అందేలా అధికారులు సమగ్రంగా ఏర్పాట్లు చేసినట్లుగా తెలిపారు. కల్వకుర్తి అభివృద్ధి పట్ల తాను కట్టుబడి ఉన్నానని, మహిళా సంఘాలు బలపడేలా ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటు అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ సభ్యులు బాలాజీ సింగ్ ఠాగూర్, సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, జిల్లెల్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.



## 2 లక్షల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 22 : మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎం. స్వామి తండ్రి నాగయ్య అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి వైద్య ఖర్చుల కోసం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి 2 లక్షల రూపాయల ఎల్ఓసి పత్రాన్ని అందజేశారు సందర్భంగా మాట్లాడుతూ అవసర సమయంలో ప్రజలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు విజయ్, అనిల్ యాదవ్, మదారి రమేష్ పాల్గొన్నారు.



## ప్రజాపాలనలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### -ఆడపడుచులందరికీ చీరెలు అందిస్తాం

### -లబ్దిదారులతో కలిసి కిచ్చెన్న గృహప్రవేశం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 22 : ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలందరికీ రూ.5 లక్షల విలువైన ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.మహేశ్వరం పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లు కట్టుకున్న లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కే ఎల్ ఆర్ మాట్లాడుతూ... గృహప్రవేశం చేసిన ఆడపడుచులకు త్వరలోనే ప్రభుత్వం తరపున చీరెలు అందజేస్తామని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్స్ కు వెళ్లేందుకు జనం ఇష్టపడలేదన్నారు. అందుకే సొంత ఊర్లోనే ఉండేలా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి లబ్ధిదారులకు ఆసరాగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిలుస్తుందని లక్ష్మారెడ్డి తెలిపారు.ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామని కిచ్చెన్నగారు గుర్తు చేశారు. భవిష్యత్ తరాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు సహా స్థానికులు పాల్గొన్నారు.




## ఉద్యమ నేత భూపాల్ రెడ్డికి శ్రద్ధాంజలి....

### సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 22

చౌటుప్పల్ మండలం లో మార్సిస్టు పార్టీ నిర్మాత కందాల రంగారెడ్డి ఉద్యమ వారసుడు ఉద్యమ నేత భూపాల్ రెడ్డి గారికి సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ఘనంగా నివాళులర్పించడం జరిగింది. యువజన సంఘం నాయకుడిగా ,ఉమ్మడి జిల్లా రైతు సంఘం నేతగా, చౌటుప్పల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా, ఎంపీటీసీగా ,ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీతగా చౌటుప్పల్ ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలు చేసి ఈ ప్రాంతంలో చిరస్థాయి నాయకుడిగా నిలిచిన భూపాల్ రెడ్డికి మున్సిపల్ కమిటీ ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది. చౌటుప్పల్ సర్పంచ్ గా ఉన్న కాలంలో పార్టీలకు అతీతంగా చౌటుప్పల్ పట్టణ ప్రజలకు ఏ ఆపద వచ్చిన పరిష్కరించడానికి భూపాల్ అన్న దిక్కే నిలిచేవాడు. అనేక ఉద్యమాల్లో ముందుండి నడిపించిన నాయకుడు భూపాల్ రెడ్డి గారు అని అన్నారు. భౌతికంగా దూరమైన మీ సేవలు, మీ పోరాట స్ఫూర్తి ,మీరు వేసిన ఉద్యమ బాటలు మీ ఆశయ సాధన కోసం పని చేస్తామని అన్నారు ..ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, అవ్వారి రామేశ్వరి, సీనియర్ నాయకులు బండారు నరసింహ ,బత్తుల దాసు, గోపగోని లక్ష్మణ్, దండా అరుణ్ కుమార్, ఉప్మాగుల శ్రీను, పర్ని ధర్మారెడ్డి, బొడ్డు అంజిరెడ్డి ,కంద గట్ల ఆనంద్, తూర్పునూరి మల్లేశం, చికూరు ఈ దయ, సిల్వర్ జంగయ్య ,మోగుదాల రాములు ,కృష్ణ ,శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..



## అయ్యప్ప పడిపూజను విజయవంతం చేయండి

### కరపత్రాలను ఆవిష్కరించిన శంకరనంద స్వామిజీ

సంస్థాన్ నారాయణపూర్ నవంబర్ 22( వార్త మిర్రర్):

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో డిసెంబరు 7వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించే అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమ కరపత్రాలను శ్రీ శంకరానంద స్వామి,అయ్యప్ప సన్నిధి స్వాములతో కలిసి ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక చౌరస్తాలో రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించే ఈ మహా పడిపూజను భక్తులు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.అలాగే ఈ యొక్క అయ్యప్ప స్వామి నూతన దేవాలయ నిర్మాణానికి నిధి సేకరణకు కూడా భక్తులు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## పబ్బు రాజు గౌడ్ దంపతుల పేరు మీద స్వామివారికి ప్రత్యేక పూజలు

### మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్

### పబ్బు రాజు గౌడ్ - అరుణ దంపతుల 28వ వివాహ వార్షికోత్సవం





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 22 చౌటుప్పల్ మండల కేంద్రంలోని పబ్బు రాజు గౌడ్ – అరుణ దంపతుల 28వ వివాహ వార్షికోత్సవం చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్, చౌటుప్పల్ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో పబ్బు రాజు గౌడ్ దంపతుల పేరు మీద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అయ్యప్ప మాలదారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్, సుర్వి నర్సింహగౌడ్, నాయకులు మోగుదాల రమేష్ గౌడ్,పాశం సంజయ్ బాబు సైదులు గౌడ్, కరీం, బొడిగె బాలకృష్ణ, కంచరకుంట్ల రామిరెడ్డి,మలిగే మల్లేష్, సంద గళ్ళ సతీష్, ఊడుగు రమేష్, ఉడుగు శ్రీనివాస్ గౌడ్, పస్తం గంగా రాములు, దేప రాజు,పబ్బు శ్రీకాంత్, బొంగు శ్రీను, ఊదరి నరసింహ, వర్కాల కుమార్, ఎండి ఎజాస్, చింతకింది గణేష్, నల్ల బాలరాజు, పాలకూర్ల మహేష్,అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అయ్యప్ప మాలదారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప దేవాలయం లో అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదం వితరణ

మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జి పబ్బు రాజు గౌడ్ – అరుణ,

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 22చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని శనివారం రోజున మాలాధారణ వేసుకున్న అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదం వితరణమునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జి పబ్బు రాజు గౌడ్ – అరుణ, దంపతుల గార్ల పెళ్లి రోజు సందర్భంగాశ్రీ సీత రామాచంద్రస్వామి దేవాలయం చైర్మన్ శ్రీ బొబ్బిళ్ల మురళి గురుస్వామి, పాలకవర్గం కామిశెట్టి చంద్రశేఖర్, గుర్రం వెంకటేశం,వర్కల వెన్నల–రవి గౌడ్ తూర్పటి నర్సింహా అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ బొబ్బిళ్ల మురళి గురుస్వామి మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గం ఎన్నికల ఇన్చార్జి పబ్బు రాజుగౌడ్–అరుణ పుణ్య దంపతుల పేరు మీద అన్న ప్రసాద వితరణ అయ్యప్ప మాలాధారణ వేసుకున్న భక్తులకు చేయడం మాకు సంతోషం పబ్బు రాజు గౌడ్–అరుణ ప్రభుత్వ పరంగా ఉన్నత పదవులు అధిరోహించాలి అని అయ్యప్ప స్వామి అనుగ్రహం ఉండాలి అయ్యాప్ప స్వామి వారిని కోరుకున్నారు.అయ్యప్ప దీక్ష చేస్తున్న స్వాములు అయ్యప్ప మాల దారణ ఉన్నప్పుడు ఎంత నిష్టగా ఉంటారో మాల విసర్జన చేసిన తర్వాత కూడా చెడు వ్యసనాలకు వదిలేయాలి మంచి మార్గంలో నడుస్తూ నిత్యం అయ్యప్ప నామస్మరణ చేసుకుంటూ ఉండాలి అన్నారు ఈ కార్యక్రమంలో శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప దేవాలయం అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్ గురుస్వామి, ప్రధాన కార్యదర్శి చింతల సాయిలు గురుస్వామి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుర్వి నర్సింహా గౌడ్ మొగుదాలరమేష్ గౌడ్ మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య గౌడ్ రాచకొండ భార్గవ్ ఉడుగు శ్రీనువాస్ గౌడ్ బోడిగే



బాలకృష్ణగౌడ్ కంచరకుంట్ల రాంరెడ్డి సుర్వి మహేష్ గౌడ్ గురుస్వాములు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, కంచరకుంట్ల వెంకటరెడ్డి సుక్క సుదర్శన్ ఉస్కాగుల నాగరాజు గౌడ్ కుంటల శశికాంత్ పాశం కృష్ణ బోరేం శ్రవణ్ కుమార్ రెడ్డి, పెంబర్ల గణేష్, పస్తం గంగారాములు చెరుకు లింగస్వామి బుర్ర శివ గౌడ్ ముదిగొండ మహేష్ దేప శ్యామ్ సుందర్ తొర్పునూరి లింగస్వామి పబ్బత్ వెంకటేష్ బక్క సాయి తదితరులు పాల్గన్నారు..

## అయ్యప్ప నగర్ లో దొంగతనం చేసిన దొంగను పట్టుకున్న పోలీసులు

### నిందితుడి వద్ద నుండి నగదు తో పాటు మానిటర్,సిపియు స్వాధీనం

### పోలీస్ సిబ్బందిని అభినందించిన సిఐ వెంకట్ రెడ్డి

దేవరకొండ నవంబర్ 22 వార్త మిర్రర్ :దేవరకొండ పట్టణంలో ఈనెల 11వ తేదీన అయ్యప్ప నగర్ లో పట్టపగలే సంచలనం సృష్టించిన దొంగతనం చేసిన నిందితుని దేవరకొండ పోలీసులు ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ కేసు విషయమై దేవరకొండ పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశాన్ని పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ సీఐ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దేవరకొండ పట్టణంలో ఈ నెల 11వ తేదీన అయ్యప్ప నగర్ లోని శరావత్ జబ్బర్ ఇంట్లో పట్టపగలు తాళం పగలగొట్టి సుమారు 8 లక్షల రూపాయలు పోయినట్లు బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టడం జరిగింది. ఈ విచారణలో భాగంగా దేవరకొండ ఏఎస్పి మౌనిక ఆధ్వర్యంలో టీమ్ గా ఏర్పడి ఎస్సైలు నారాయణరెడ్డి,బి.రాజు లు నిందితుడు పగిళ్ల శివ ను ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లి మండలం వింజమూరు గ్రామానికి చెందిన పగిళ్ల శివ 2016 సంవత్సరం నుండి తాళం వేసి ఇళ్లలో దొంగతనాలు చేయడంలో సిద్ధహస్తుడిగా ఉంటూ 14 సంవత్సరాల వయసు నుండే దొంగతనాలు చేయడం ప్రారంభించారని అదేవిధంగా ఎన్నోసార్లు జైలుకు వెళ్లి రావడం జరిగిందని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా ఇతను పై సుమారుగా 11 పైచిలుక దొంగతనం కేసులు ఉన్నాయని పోలీసు వారు తెలిపారు. నిందితుడు శివ పదవ తరగతి చదువుకుని అనంతరం చదువు మానేసి చెడు వ్యసనాలకు బానిసై దాంతోపాటు జూదం బెట్టింగ్ చేసేవాడని వాటికోసం చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ అతని వ్యసనాలు నెరవేర్చుకోవడానికి తాళం వేసిన ఇండ్లలో దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. ఇలా



తాళం వేసిన ఇండ్లలో రాత్రి పూట గాని పగటిపూట గాని రెక్కీ నిర్వహించి ఎంతో చాకచక్యంగా దొంగతనాలు చేస్తూ ఉండేవాడని అలాంటి క్రమంలోనే దేవరకొండ పట్టణంలో ఈ నెల 11వ తేదీన తాళం వేసిన ఇంట్లో జన సంచారం లేని నివాసం వద్ద రెక్కీ నిర్వహించి దొంగతనం చేశారని దొంగతనం చేసిన సొమ్ముతో హైదరాబాదులోని కర్మన్ ఘట్ లో క్రాంతి నగర్ లో అద్దె ఇంట్లో సజ్జా పై నగదును దాసి అందులో కొంత నగదుతో కంప్యూటర్ కొనుగోలు చేసి కొంత డబ్బును అవసరాల నిమిత్తం ఖర్చు చేశారని పోలీసు వారు తెలిపారు. అంతేకాకుండా ఈ నెల 22వ తేదీన మళ్లీ తాళం వేసిన ఇంట్లో రెక్కి నిర్వహిస్తూ ఉండగా పోలీసులు శాఖ చక్రంతో నిందితుని పట్టుకున్నట్లు తెలియజేశారు. పట్టుకున్న నిందితుని వద్ద 3,68,000 నగదు తో పాటు ఒక మానియేటర్ సిపియు ఐదు గ్రాముల బంగారం 50వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వారు తెలిపారు. ఈ కేసులో ఎంతో చాకచక్యంగా చేదించిన పోలీస్ సిబ్బంది కే.సతీష్, బి.అంజయ్య, వి. సింహాద్రి, రైటర్ ఎస్.కె చాంద్ పాషా, హరిబాబు యాదయ్య చంద్రమౌళి లను సీఐ వెంకటరెడ్డి అభినందించారు.

## మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

దేవరకొండలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ నవంబర్ 22 వార్త మిర్రర్ :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నేడు దేవరకొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో నిర్వహించిన చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ హాజరై, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధుల సమక్షంలో అర్హత కలిగిన మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఆయన తెలిపారు. మహిళా సాధికారతే తెలంగాణ ప్రగతి అనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించడానికి, కుటుంబ ఆర్థిక శ్రేయస్సును బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అందులో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఒక గొప్ప ముందడుగు అని ఆయన తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి మంది మహిళలకు ఉచితంగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.దేవరకొండ నియోజకవర్గంలో 68,000కు పైగా చీరలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.ప్రతి గ్రామ పంచాయతీ, మండల కేంద్రం, మున్సిపాలిటీ కార్యాలయాల్లో నియోజకవర్గంలోని అర్హత కలిగిన ప్రతి మహిళకు చీరలు అందజేయబడతాయని ఆయన తెలిపారు.ఈ చీరలను రాజన్న సిరిసిల్ల హ్యాండ్లూమ్ నూలు రంగంలోనే తయారు చేయించడం వల్ల వేలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.తెలంగాణ చేనేత వృత్తి నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో అభినందనీయం అని ఆయన పేర్కొన్నారు.చీరల పంపిణీ సమయంలో ప్రతి మహిళా లబ్ధిదారుల వివరాలు నమోదు చేసి, భవిష్యత్ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేస్తామని తెలిపారు. ఇది మహిళలకు మరిన్ని పథకాల ప్రయోజనాలు అందేలా



చేస్తుందని ఆయన అన్నారు.ఇందిరమ్మ చీరలు తెలంగాణ సంస్కృతికి చిహ్నమని, ఈ కార్యక్రమం ద్వారా మహిళల గౌరవం, సాంస్కృతిక గుర్తింపు మరింత వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు.అదేవిధంగా మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, మహిళాశక్తి కార్యక్రమాలు, గృహలక్ష్మి వంటి పథకాలతో ప్రజా ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణా రెడ్డి, ఎంపీడీవో లు డానియల్, చంద్రమౌళి, ఎమ్మార్వో మధుసూదన్ రెడ్డి, పార్లమెంట్ కో– ఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, శిరందాసు లక్ష్మమ్మ కృష్ణయ్య, హనుమత్ వెంకటేష్ గౌడ్, డిపిఎం విజయలక్ష్మి,నాగలీల,పురుషోత్తం, విజయ్ కుమార్, ఎపిఎం లు మాతంగి కలమ్మ, కర్ణకంటి సరస్వతి, జ్యోతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు కొర్ర గౌతమి, రాంసింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## కేవలం రూ.50 వేలతో స్టార్ట్ చేసి.. వ్యాపార సామ్రాజ్యం నిర్మించవచ్చు! లక్షలొచ్చే బిజినెస్

టెన్షన్ ఉద్యోగాలు వదిలి సొంత వ్యాపారం చేయాలనుకుంటున్నారా? తక్కువ పెట్టుబడితో లక్షలు సంపాదించే అద్భుతమైన అవకాశం సరుకు రవాణా వ్యాపారంలో ఉంది. కేవలం రూ.50 వేల డౌన్పేమెంట్తో వాహనం కొని, కష్టపడితే, మీరు మీ వాహనాల సంఖ్యను పెంచుకుంటూ సొంత రవాణా కంపెనీని నెలకొల్పవచ్చు.ఈ టెన్షన్తో కూడిన ఉద్యోగాలు ఏం చేస్తాం. ఒక మంచి వ్యాపారం చేసుకుంటే హాయిగా బతకొచ్చు. అయినా ఒకడి కింద పనిచేసే కంటూ మనకొచ్చిన పని మనమే చేసుకుంటే డబ్బుకు డబ్బు, గౌరవానికి గౌరవం వస్తుందని ఆలోచిస్తూ చాలా మంది బిజినెస్ చేయాలని అనుకుంటూ ఉంటారు. అయితే వ్యాపారం చేయాలంటే మొదట కావాల్సింది పెట్టుబడి. చాలా మంది అది లేకే తమ వ్యాపార కలను నిజం చేసుకోలేకపోతుంటారు.అయితే తక్కువ పెట్టుబడితో ప్రారంభించి లక్షలు సంపాదించే ఒక బిజినెస్ ఐడియా గురించి ఇప్పుడు తెలుసుకుందాం. అయితే ఈ వ్యాపారానికి పెట్టుబడి తక్కువే అయినప్పటికీ.. కష్టం మాత్రం ఎక్కువ ఉంటుంది. అందుకే సిద్ధం అనుకుంటేనే ఈ వ్యాపారంలోకి దిగితే మంచిది. ఇంతకీ బిజినెస్ ఏంటంటే.. ట్రాన్స్పోర్ట్ బిజినెస్. సరుకు రవాణా అనేది ఇప్పటికీ డిమాండ్ తగ్గని సెక్టార్. ఒక రూ.50 వేల డౌన్పేమెంట్తో ఒక చిన్న ట్రాన్స్పోర్ట్ వెహికల్ తీసుకొని,